అంగవైకల్యాన్ని అధిగమిస్తూ.. ఆత్మవిశ్వాసంతో సంగీత ప్రస్థానం

ప్రేమ ట్రస్ట్ ఫర్ బ్లైండ్స్ బృందం స్వయంకృషితో ఆదర్శప్రాయం



గాజువాక, నవంబర్ 6 సిటిజన్ టైమ్స్, :

కళ్లకు చూపు లేకపోయినా ఆత్మవిశ్వాసం, పట్టుదల, స్వయంకృషి ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రేమ ట్రస్ట్ ఫర్ బ్లైండ్స్ బృందం నిరూపిస్తోంది. అంగవైకల్యాన్ని అడ్డంకిగా భావించకుండా సంగీతాన్ని జీవనాధారంగా మలుచుకుంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. గాజువాకలో శుక్రవారం ప్రేమ ట్రస్ట్ ఫర్ బ్లైండ్స్‌కు చెందిన గాయకుల బృందం సందడి చేసింది. ఈ బృందంలో గాజువాకకు చెందిన గాయకులు కామేష్ రెడ్డి, రావణమ్మతో పాటు గోవింద్, జ్యోతిబాబు తదితరులు ఉన్నారు. వీరంతా ఒక బృందంగా ఏర్పడి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు, తమలాంటి దివ్యాంగులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. తాము మాత్రమే ఆర్థికంగా ఎదగాలనే ఆలోచనకు పరిమితం కాకుండా, తమలాంటి వారు కూడా ఆత్మగౌరవంతో జీవించాలనే ఆశయంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. సంగీతాన్ని ఉపాధిగా మలుచుకుంటూనే సామాజిక సేవలోనూ తమవంతు పాత్ర పోషిస్తున్నారు.

ఈ బృందానికి చెందిన ఒక సభ్యుడు ప్రముఖ సంగీత కార్యక్రమం ‘పాడుతా తీయగా’లో పాల్గొని ఐదో రౌండ్ వరకు చేరుకోవడం విశేషం. పోటీలో తదుపరి దశకు చేరుకోలేకపోయినా, తన ప్రతిభతో ఆ స్థాయికి చేరుకోవడం ఆయన పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. చూపు లేకపోవడం తమ కలలకు అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, కృషి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తమ జీవితాల ద్వారా చాటిచెబుతున్న ప్రేమ ట్రస్ట్ ఫర్ బ్లైండ్స్ బృందం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ బృందం మరిన్ని విజయాలు సాధిస్తూ సంగీత రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.



ఎమ్ .కే .డి .విజయ లత

సైకాలజిస్ట్

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776